# బోధివృక్షం

అప్పుడే నూనుగు మీసాల యౌవనంలోకి అడుగు పెడుతున్నాడు సిద్దార్థ. అతని కోరికలు గుర్రాలవుతున్నాయి. ఊహలకు రెక్కలొస్తున్నాయి. డిప్యూటీ కలెక్టర్‌గారి కొడుకైన తనకు స్కూటర్ లేకపోవడం అతని కవమానకరంగా ఉంది. అది కొనివ్వనందుకు తండ్రిపైన కోపంగా ఉంది. ఎన్నిసార్లడిగినా తండ్రి తన మాట కాదంటున్నందుకు ఉక్రోషంగా ఉంది. తానడిగినవి కాదని తండ్రి ఈ విషయంలో ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నడో అతని కర్థం కావడం లేదు. ఆయన్నెలా ఒప్పించాలో తోచడం లేదు. అమ్మ ద్వారా అడిగిపించినా లాభం లేకపోయింది. ఇక తండ్రితో నిష్ఠురంగా మాట్లాడైనా సరే ఒప్పించాలని నిర్ణయించుకున్నాడు. భోజనం చేసొచ్చి ముందు గదిలో కూర్చొని పేపర్ తిరగేస్తున్న తండ్రి దగ్గరి కొచ్చాడు. తండ్రికెదురుగా కుర్చిలో కూర్చున్నాడు సిద్దార్థ.

"నాన్నా?" మెల్లగా పిలిచాడు.

పేపర్ పక్కన పడేసి - "బాబూ?" అన్నాడు తిరుపతయ్య.

"నేనడిగిన స్కూటర్..." అంటూ ఆగాడు సిద్దార్థ.

"నీ కిదివరకే చెప్పాను కద బాబూ! నీకు స్కూట రవసరముంటేనా దుంది. డిగ్రీ ఫస్ట్ క్లాస్‌లో పాసవడానికి ప్రయత్నించు. ఆ తరువాత కొనిస్తానని" అన్నాడు తిరుపతయ్య.

"మా ఫ్రెం డ్సందరికీ స్కూట ర్లున్నాయి." ముఖం ముడుచుకొన్నాడు.

"ఉంటే ఉండొచ్చు. ఒక్క విషయం జ్ఞాపకం ఉంచుకో బాబూ! విద్యార్థికి సరదాల కంటే చదువు ముఖ్యం."

తండ్రి మాట విన్న సిద్దార్థ ముఖంలో రోషం, "న న్నింకా చిన్నపిల్లాడి కిందనే జమకడుతున్నారు మీరు! డ బ్బున్నది అనుభవించడాని క్కాకపోతే మ రెందుకు...? మీరు పిసినారిలా ప్రవర్తిస్తున్నారు."

కొడుకు మాటలుసూటిగా హృదయానికి తగిలాయి. బాధ పైకి కనబడనీయకుండా అన్నాడు తిరుపతయ్య "అవును.నువ్వు పెద్దవాడి వవుతున్నావుకదూ...! నేను మరిచేపోయ్యాను." మామూలుగా అన్నాడు.

తండ్రి మాటల్లోని వ్యంగం అర్థమైనా ఎలాగైనా తన పంతం నెరవేర్చుకోవాలన్న ఉద్దేశంతో - "నాన్నా! మీరు డిప్యూ కలెక్టర్ అయినా, కలెక్టరయినా లాభ మేంటి? ఓ లెక్చరర్ కొడుకు కూడా స్కూటర్ మేంటేన్ చేస్తున్నాడు. ఎం. ఆర్. ఓ. కొడుక్కూ స్కూట రుంది. నేనే దురదృష్టవంతుణ్ణి." మరో బాణం వదిలాడు సిద్దార్థ.

అయినా తొణకలేదు తిరుపతయ్య "బాబూ! నేనేం చేసినా నీ బాగుకోసమే అన్నది మరచిపోకు.

నాకు నీ చదువు, భవిష్యత్తు ముఖ్యం'' అన్నాడు.

తాను సంధించిన రెండు అస్త్రాలూ వృథా అయ్యేసరికి ఏం చేయాలో తోచలేదు సిద్ధార్థకు. ఎంత నిష్ఠురంగా మాట్లాడైనా సరే తన పని పూర్తి చేసుకోవడానికే నిర్ణయించుకున్నాడు.

''కొనివ్వగలిగిన ఆర్థిక స్తోమత ఉండి కూడా మీరు నాకు స్కూటర్ కొనివ్వడం లేదు. పైగా నా భవిష్యత్తు కోసమే ఏదో చేస్తున్నట్టు మాట్లాడుతున్నారు. మీకు నాపైన ప్రేమ లేదు. నన్నుమీరు కష్టపెడుతున్నారు. నా కిప్పుడే కావాలి స్కూటర్ ఆ తరువాత మీరు కొనిచ్చినా అక్కర్లేదు. నాకు స్కూటర్ కొనిచ్చేవరక అన్నం ముట్టను'' కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ అక్కన్నుంచి లేచి లోపలికెళ్ళాడు సిద్ధార్థ.

కొడుకు ప్రయోగించిన పాశుపతాస్త్రం తిరుపతయ్య గుండెకు సూటిగా తగిలింది. బాధతో విల విల లాడిపోయాడు. తాను కొడుకును ప్రాణంలో ప్రాణంగా చూసుకుంటున్నాడు. ఎండ కన్నెరుగకుండా పెంచాడు. ఆకలంటే ఏమిటో, కష్టమంటే ఏమిటో తెలియకుండా పెంచాడు. అలాంటికొడుకును తానుకష్టపెడుతున్నాడా? తనను తానే ప్రశ్నించుకున్నాడు తిరుపతయ్య. కొద్ది క్షణాలు బాధతో కళ్ళుమూసుకున్నాడు.

కొద్ది రోజులుగా తాను కొడుకును గమనిస్తున్నాడు. జీవితమంటే నిర్లక్ష్యం. చదువంటే అశ్రద్ధ. స్నేహితులు, తిరగడం, సినిమాలు, చదువుమీద కంటే ఇతర విషయాలకే ప్రాధా[illegible]స్తున్నాడు. ఈ వయసే అలాంటిది. ఈ వయసులో తప్పటడుగులు వేసే అవకాశాలెక్కువ. అందుక[illegible]ండ్రిగా అతన్ని సరియైన దారిలో పెట్టే బాధ్యత తనపైన ఉంది. ఇప్పుడు దారి తప్పితే కష్టం. తన ఆశలన్నీకొడుకుపైనే. కొడుకుది ఉజ్వల భవిష్యత్తు కావాలని తన తపన. స్కూటర్ కూడా ఉంటే చదువుమరింత నిర్లక్ష్యంచేస్తాడని కొనివ్వడం లేదుతాను. కాని కొడుకు తననపార్థం చేసుకున్నాడు. తాను పిసినారిననీ, కష్టపెడుతున్నాననీ తనపైననిందలు మోపుతున్నాడు. మరి తనిప్పుడేం చేయాలి? స్కూటర్ కొనివ్వడం తనకు కష్టమేం కాదు. కాని దారి తప్పుతున్న కొడుకును, చదువును నిర్లక్ష్యం చేస్తున్న కొడుకును సరియైన మార్గంలో పెట్టాలి. ఎలా...? ఎలా...?

తీవ్రంగా ఆలోచించాడు తిరుపతయ్య.

తానుకొడుకును పేదరికం తెలియకుండా పెంచాడు. తాను పడ్డకష్టాలు, దుర్భర దారిద్ర్యం సంగతి అతనికి తెలియకుండా పెంచాడు. భుజాలమీద ఎత్తుకొని తిప్పుతూ, కాలు కింద పెడితే కందిపోతా డన్నంత అపురూపంగా పెంచాడు. ప్రపంచం గురించి తెలియకుండా పెంచాడు. అతనికి డబ్బు విలువేమాత్రం తెలియదు. అడిగిందే ఆలస్యంగా అన్నికోర్కెలూ తీర్చాడు తా నాతన్ని అలనాటి సిద్ధార్థుడిలాగే పెంచాడు.

ఇప్పుడతనికి వాస్తవ పరిస్థితులను గురించి తెలిసేట్టు చేయాలి. జీవిత వాస్తవాలు తెలుసుకునేలా చేయాలి. లేకుంటే దారితప్పే ప్రమాదముంది. ఈ వయసులో పడ్డముద్ర శాశ్వతంగా ఉండే అవకాశముంది.

ఓ గంటసేపు దీర్ఘమైన ఆలోచనలో పడ్డాడు. తిరుపతయ్య. ఆయన కళ్ళముందో మెరుపు మెరిసింది. ఆయనో నిర్ణయానికొచ్చాడు.

''బాబూ! సిద్ధార్థ! ఇటు రా!'' కొడుకును పిలిచాడు.

తండ్రి దారి కొచ్చాడని సంబరపడుతూ బయట కొచ్చాడు సిద్ధార్థ. ''బాబూ! రేపు మ నూరెళ్దాం.

వచ్చిం తరువాత వెంటనే నీకు స్కూటర్ కొనిస్తా'' అన్నాడు తిరుపతయ్య.

''ఇప్పు డెందుకండీ ఆ ఊరెళ్ళడం...? ఆ ఊళ్ళో మనకేముందని?'' అంది సిద్ధార్థ తల్లి లక్ష్మీదేవి.

''సిద్ధార్థ చిన్న పిల్లాడిలా ఉన్నప్పుడెళ్ళా మక్కడికి. పన్నెండేళ్ళకుపైగా అయింది. ఓ సారి పోయొద్దాం.

''నే నెందుకు నాన్నా ఆ ఊరికి?'' అన్నాడు సిద్ధార్థ.

''పనుంది. నువ్వు నాతో రావాలి.''

''సరే నన్నాడు సిద్ధార్థ.

---

ట్రెయిన్ దిగి రెండు బస్సులుమారి ఆ గ్రామం చేరుకున్నారు తిరుపతయ్య సిద్ధార్థ. చాలాకాలం తరువాత వచ్చిన మిత్రుణ్ణి సాదరంగా ఆహ్వానించాడు లక్ష్మారెడ్డి.

ప్రయాణంలో ధూళి, దుమ్ముతో నిండిన శరీరాన్ని స్నానం చేసి శుభ్రం చేసుకున్నారు. తండ్రీకొడుకులు. మిత్రులిద్దరూ ఒకరి కష్టసుఖాలొకరితో చెప్పుకున్నారు. ఊరి విషయాలు మాట్లాడుకున్నారు. చిన్ననాటి విషయాలను జ్ఞాపకం చేసుకున్నారు. ఈలోగా భోజనం తయారైంది. భోజనంముగించి మళ్ళీ మాటల్లో పడ్డారు స్నేహితులు.

తిరుపతయ్య వచ్చాడని తెలియగానే అతని పాత మిత్రు లెంతోమంది వచ్చి మాట్లాడి పోతున్నారు. ''కొడు కింత పెద్దవాడయ్యాడా?'' అని పలుకరిస్తున్నారు. పట్నంలో పుట్టి, పెరిగిన సిద్ధార్థకు ఆ పల్లె జనం ఆప్యాయతలు, ఆత్మీయతలుకొత్తగా అనిపిస్తున్నాయి. మధ్యాహ్న మయ్యేసరికి చాలామంది మాట్లాడి వెళ్ళిపోయారు.

వాళ్ళంతా వెళ్ళిపోయిం తరువాత కొడుకును తీసుకొని తనపాత ఇంటికి కెళ్ళాడు తిరుపతయ్య ఆ చిన్న పెంకుటిల్లు సంపూర్ణ శిథిలావస్థలో ఉంది. ఇంటి పక్కన సగం కూలిన బావి. ఇంట్లో ఎవరూ లేకపోవడం వల్ల పాడుబడిపోయుంది. ఆ ఇంటిని చూపిస్తూ తిరుపతయ్య - ''సిద్ధూ! ఇదే నేనుపుట్టి, పెరిగిన ఇల్లు. అదుగో ఆ మూలకున్న దీగూట్లో చిన్న దీపం పెట్టుకొని, ఆగుడ్డి వెలుతురులో చదువుకునేవాణ్ణి. ఏడుకిలోమీటర్ల దూరంలో ఉన్న పక్క ఊరికి రోజూ నడిచివెళ్ళి, వస్తూ నా హైస్కూల్ చదువు పూర్తిచేశాను. మన డైనింగ్ హాలంత కూడా లేని ఈ ఇంట్లోనే అమ్మ, నాన్న నానమ్మ, నేను, మా చెల్లెలు ఉండేవాళ్ళం.''

ఆ ఇంటిని, ఆ వాతావరణాన్నిచూసిన సిద్ధార్థ ముఖంలో సంతోషం మాయమైంది. తానలాంటి పెంకుటిళ్ళుకూలినాలి చేసుకునే వాళ్ళకు, రిక్షా లాగి బ్రతికే వాళ్ళకు ఉండడం చూశాడు. పన్నెండు గదులతో రెండు పోర్షన్లుగా విభజితమై, ఆధునాతన సౌకర్యాలతో ఉన్న పట్నంలోని తమ ఇంటిముందు ఈపెంకుటిల్లు సూర్యుడి ముందు దివి టీలా కూడా అగుపడటం లేదు. ఇలాంటి ఇంట్లో తన తండ్రి ఒకప్పు డున్నాడన్నసత్యం అతనికి నమ్మశక్యం కానిదిగా తోస్తూంది. కాని తండ్రి తన కిప్పు డీ ఇంటి నెందుకు చూపిస్తున్నాడో అతని కర్థం కావడం లేదు. తండ్రి చెప్పినమాటలు వింటూ ఏం మాట్లాడలేదు సిద్ధార్థ. కొద్దిసేపా ఇంటి దగ్గరుండి, కొడుకును తీసుకొని బయట కొచ్చాడు తిరుపతయ్య. పొలాల్లో నాట్లేసేసమయం కావడం వల్లూరి జనమంతా వ్యవసాయ పనులకెళ్ళారు. బజార్లో జనం కనబడటం లేదు. కొడుకుతో మాట్లాడుతూ నడుస్తున్నాడు తిరుపతయ్య.

''బాబూ నా బ్రతుకు నీ దానిలా వడ్డించిన విస్తరి లాంటిదికాదు. నిరక్షరాస్య, నిరుపేద అయిన కుటుంబంలో ఈ మారుమూల పల్లెటూళ్ళో పుట్టాను నేను. మా నాన్న రెండు బక్కెడ్లతో వ్యవసాయం చేసేవాడు. ఆయన విశ్రాంతి తీసుకోగా నేనెప్పుడూ చూడలేదు. ఆయన ఎంత రెక్కలు ముక్కలు చేసుకున్నా కడుపునిండా హాయిగా ఎప్పుడూ తినలేదు. నేను స్కూల్ టైమ్ వరకు, స్కూల్ వదిలింతరువాత నాన్నకు వ్యవసాయ పనుల్లో సాయంచేసేవాణ్ణి. అయినా నాన్నకు గడువక, నన్ను చదువు మానిపించే ప్రయత్నం చేశాడు. ఎలాగో నాన్ననొప్పించి స్కూల్ ఫైనల్ వరకు చదివాను. అతికష్టంమీద మెరిట్ స్కాలర్షిప్పుతో నా చదువైపోయింది. అటు తరువాత వాళ్ళ వీళ్ళ కాళ్ళు పట్టుకొని తహసీ లాఫీసులో గుమాస్తాగా చేరాను. ప్రైవేటు పరీక్షలకు కట్టిక్వాలిఫికేషన్ పెంచుకున్నాను. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలురాసి స్వయంకృషితో ఈ స్థితికొచ్చాను.''

తండ్రి మాటలు వింటున్నాడు సిద్ధార్థ. ఈలోగా వాళ్ళో గుడిసె దగ్గరకు చేరుకున్నారు. చీకుపట్టిన తాటి కమ్మలు కప్పుగా ఉన్న పూరిగుడిసె. బిచ్చలు రాలిపోయికూలిపోతున్న గోడలు, గుడిసె ముందు రెండుకుండల్లో నీళ్ళు, పక్కనే జాలరి. జుబ్బురుమంటూ ఈగలు, దోమలు, గుడిసె ముందున్న వాకిట్లో అల్యూమినియం గిన్నెల్లో నూకల బియ్యపన్నం, పచ్చిమిరపకాయల తొక్కుతో కలుపుకొని తింటున్నారు అయిదేళ్ళ అమ్మాయి, ఏడేళ్ళ బాబు, చిరిగిపోయిన బట్టలు, ముక్కు వెంట చీమిడిచారికలతో చూడటానికికసహ్యంగా ఉన్నారు వాళ్ళు. అన్నంపై ఈగలు ముసురుతుంటే వాటిని ఎడమ చేత్తో కొడుతూ తింటున్నారు.

తిరుపతయ్య సిద్ధార్థలను చూసి తినడం ఆపి ఆశ్చర్యంగా చూస్తున్నారా పిల్లలు తమ ఇంటికి రాకూడని వాళ్ళు వచ్చినట్టుగా ఉన్నా యా చూపులు, అపురూపమైన వ్యక్తులను చూస్తున్నట్లుగా ఉన్నాయా చూపులు.

కొద్దిసే పలాగే చూసి - ''అవ్వా ఎవ్వలో వచ్చింద్రే!'' అన్నాడు బాబు, బాబుమాట విని ఓ ఆవిడ ఇంట్లోంచి బయుట కొచ్చింది. ఆమె పేరు నర్సమ్మ. నలభై ఏళ్ళుంటాయి. కాని యాభై ఏళ్ళు పైబడిన దానిలాకనబడుతుంది. లోతుకుపోయిన కళ్ళు, చిప్పిరెంటుకలు, ముఖంపైన వయసునుమించిన ముడతలు, దొడ్డు నేత చీర కట్టుకొని మూర్తీభవించినపేదరికంలా ఉందామె.

తిరుపతయ్యను చూసి కొంగు సర్దుకొని ''ఎప్పు డొచ్చింద్రు బావ? కాళ్ళు కడుక్కోండ్రి'' అంది.

''పొద్దున్నే వచ్చినం, లక్ష్మారెడ్డింట్ల భోజనం కూడా అయింది. రాజ య్యేడి?'' అన్నాడు తిరుపతయ్య.

''మీ తమ్ముడు నాగలి దున్న పెయిండు. ఇతకుముందే పెద్ద పిల్లతోని సద్దిపంపిన కూసోండ్రి'' అని వాకిట్లో మంచం వాల్చింది నర్సమ్మ.

ఆ కుక్కిమంచంలో కూర్చోవడానికి మనసొప్పలేదు సిద్ధార్థకు. అయినా తండ్రితో పాటు కూర్చోక తప్పలేదు.

''మీరుండేదేమో గంత దూరంల పట్నంల నాయె. మేముండేది గిక్కన్నాయె. అంత మంచిగున్నరా బావ?'' అంది నర్సమ్మ.

''బాగానే ఉన్నాం...'' అన్నాడు తిరుపతయ్య.

''కొడుకు గింత పెద్దో డయిండా బావ? మంచిగున్నావా బిడ్డ?'' అని సిద్దార్థపైనచేయి వేసింది నర్సమ్మ.

మురికి మురికిగా ఉన్న ఆమె చేయి మీదపడితే ముఖం చిట్లించాడు. ముక్తసరిగా జవాబిచ్చాడు.

''మీ అన్నచ్చిండు గాదుర...'' ''ఇంకా అన్నం తినుడు గాలేద...? లోపల కూసోని తినుండ్రి..'' అంది పిల్లలతో.

ఆ పిల్ల లిద్దరూ గుడిసె లోపలికి కెళ్ళారు.

''రాజయ్య క్కాడునొప్పి తగ్గిందా? అలాగేవస్తుందా?'' అడిగాడు తిరుపతయ్య.

అన్నం తినడం ముగించి దూరంగా నిల్చుని సిద్దార్థవైపు వింతగా చూస్తున్నారు నర్సమ్మ పిల్లలు.

''అప్పుడప్పుడొస్తుంది. పోతంది. ఆయనకెప్పుడున్నదేనాయె. మంచి డాకటరుకు సూపించున్నంటె వెయ్యిలయితయి. గన్నిపైన లేడున్నయి?'' అని కొద్దిసేపాగి - ''అక్క మంచిగుందా? బుజ్జి లగ్గానికెదిగిం దునుకుంట. మీరు గిక్కడికెందుకొస్తరు? అచ్చినా గీ మురికిండ్లల్లెట్లుంటరు?'' అంది నర్సమ్మ.

కొంత సేపు ఊరి విషయాలు మాట్లాడి లేచాడు తిరుపతయ్య. తండ్రితో పాటు సిద్దార్థకూడా లేచాడు. రాజయ్య వచ్చింతరువాత లక్ష్మారెడ్డింటికి రమ్మనిచెప్పి బయలుదేరాడు.

''రాజయ్య మా స్వంత చిన్నాన కొడుకు. వాళ్ళెంత దుర్భర పరిస్థితుల్లో ఉన్నారో చూశావా?'' అన్నాడు తిరుపతయ్య.

పేదరికాన్నెప్పుడూ ఇంత దగ్గరగాచూడని సిద్దార్థ మనసు వికలమైంది. మాట్లాడకుండా తండ్రితో నడుస్తున్నాడు.

మరో ఇంటికి తీసుకెళ్ళాడు తిరుపతయ్య. అక్కడ మరింత జుగుప్సాకరమైన దృశ్యాన్ని చూశాడు సిద్దార్థ. ఏడెనిమిదేళ్ళ పాప ఇంటి అరుగుమీద కూచు నుంది. ఆమెమొలకు చిన్న గుడ్డ తప్ప ఒంటి మీద బట్టల్లేవు. ఆమె ముందో కంచుగిన్నె. ఆ గిన్నెలో పాచిపోయిన జొన్నగడుకన్నం. అందులో పచ్చిపులుసు పోసుకొని ఈగలు ముసురుతుంటే కొట్టుకుంటూ తింటుందామె. ఆ దృశ్యాన్ని చూస్తుంటేనే వాంతి కొచ్చినంత పనైంది సిద్దార్థకు. ఇంట్లో ఎవరూ లేనట్టున్నారు. తలుపేసుంది.

''వీళ్ళు కూడామనకు పాలివాళ్ళే. ఇతని కుంది ఎకరం భూమి. దాన్ని దున్నుకుంటూ, కూలి పని చేసుకుంటూ బ్రతుకుతుంటాడు. ఆరుగురు పిల్లలు. ఒకర్ని కూడా చదివించలేకపోయాడు. పెద్ద వాళ్ళిద్దరూపాలే ర్లున్నారు. మన రక్తసంబంధీకు లిలాంటి స్థితిలో ఉంటారని నువ్వుకలలోకూడా ఊహించుండవు'' అన్నాడు తిరుపతయ్య.

సిద్దార్థకు కడుపులో దేవినట్లయింది. అవును, తనవాళ్ళింతటి దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని తనకు తెలియదు.

కొడుకుతో మాట్లాతూరి పక్కనున్నపొలాల దగ్గరికి తీసుకెళ్ళాడు తిరుపతయ్య. మోకాలు బంటి దిగుబాట్లో అతి కష్టంగా అడుగుతీసి వేస్తూ నాగలి దున్నుతున్నాడో వ్యక్తి అతని ఒంటి నిండా బురద. అస్తిపంజరంలా ఎముకలు తేలి ఉన్నాయి.

''అదుగో, ఆ నాగలి దున్నేవ్యక్తిమా పెదనాన్న కొడుకు. అంటేనీకు పెదనాన్నవుతాడు. నేను చదువుకో నుండకపోతే బహుశః ఇలాగే బ్రతికేవాణ్ణి'' కొడుకుతో అన్నాడు తిరుపతయ్య.

ఇద్దరూ వెళ్ళి గట్టుపైన నిల్చున్నారు. వాళ్ళను చూసినాగ లాపి వచ్చాడు వెంకటయ్య-''

ఎప్పుడచ్చింద్రు తమ్మీ? అంత బాగున్నారా?''

''మంచిగనే ఉన్నం. అవ్వ మంచిగుందా?'' అడిగాడు తిరుపతయ్య.

'' ఈడు మన సిద్దన్ననా? ఎప్పుడో ఏలెడంతున్నపుపడుచూసిన, ఎప్పుడ న్నచ్చినానువ్వొక్కనివే అత్తివి? ఏం జదువుతండు కొడుకు?'' అన్నాడు వెంకటయ్య.

''బియ్యే పెద్దో డెం జేస్తండె?''

''చదు వేస్తె వానికొంటబట్టలేదు. ఇగెవుసంలనే పెట్టిన. ఇద్దరం జేసుటానికి బూమేడుంది? గందుకే పాలేరుంచిన. చిన్నోడు పన్నెండు సదువుతండు.''

''పంట లెట్లున్నయి?''

''చిన్న చిన్న ఎవుసాల సంగతి నీకెర్కలేదా? ఎంతజేసినా ఏడే మాన్కె అన్నట్టుంటది. ఎక్కడేసిన గొంగ డక్కన్నే ఉంటది. ఎవుసంల. గడి యరికాము లేకుంట సేనుడే కని గవ్వయితే కూడవెట్టింది లేదు. కిందికో మీదికో బట్ట పొట్టకెల్లుతుంది.''

కొద్దిసేపు చిన్ననాటి విషయాలను గురించి, ఇద్దరూ కలిసి వ్యవసాయ పనులకు పోవడం గురించి మాట్లాడుకున్నారు.

''గా యిల్లు కూలిపోతంది గద తమ్మి మంచిగ సేయించక పోతివి. లేకుంటె అమ్మనన్నలమ్ము. నీ పిల్ల లచ్చి గిక్కడుంటరా ఇగ?''

''అమ్మితే ఏమొస్తయేదానికి. అట్లుండనియ్యి, అదుందని ఎప్పడన్న ఈ ఊరికి రావచ్చు'' అన్నాడు తిరుపతయ్య.

మరి కొద్దిసేపు మాట్లాడి వెళ్తున్నానని వచ్చాడు తిరుపతయ్య సాయంత్రం వరకు లక్ష్మారెడ్డి ఇల్లు చేరుకున్నారు.

'' ఇదీ మన బంధువుల పరిస్థితి. నేను పుట్టి, పెరిగిన నేపథ్యం. అంతమంది బంధువులుండగా నేను నిన్ను ఈ స్నేహితుడు డింటి కెందుకు తీసుకొచ్చానో తెలుసా? అక్కడ ను వ్వొక్క పూట కూడా భోజనం చేయలేవని'' అన్నాడు తిరుపతయ్య.

తెల్లవారి మరెన్నో దృశ్యాలను చూపించాడు తిరుపతయ్య. ఎన్నోసంగతలు చెప్పాడు. పల్లెటూళ్ళంటే కేవలం పచ్చని పొలాలు, అందమైన దృశ్యాలన్న అభిప్రాయమున్న సిద్ధార్థ కెన్నో విషయాలు తెలిశాయి. అక్కడున్న రెండు రోజుల్లో చూసిన దృశ్యాలు, తండ్రి చెప్పిన విషయాలతనిపైన గాఢ ముద్ర వేవాయి. చినిగిన బట్టలతో, చీమిడి ముక్కులతో, తన నో అపురూప వ్యక్తిగా దూరం నుంచే చూసే తన పాలివాళ్ళను చూశాడు. ఆడుతూ పాడుతూ కాలం గడపాల్సిన పసివయసులో నాగేటి చాళ్ళకే అంకిత మవుతున్న తన రక్తసంబంధీకులను చూశాడు. దుర్భర దారిద్ర్యం అనుభవిస్తున్న తన బంధువులను చూసిన సిద్ధార్థ మనసు కలత చెందింది. తన అన్నలు, తమ్ముల్లు, చెల్లెళ్ళు, అక్కలు, తాతలు, తాతమ్మలు, చిన్నాన్ననుం చొచ్చిన రక్తసంబంధీకుల దుర్భర పరిస్థితులు అతన్ని ఆలోచింపజేశాయి. దారిద్ర్యాన్నిహేయమైన ఆర్థిక పరిస్థితులను, అందులో తమ సమీప బంధువుల పరిస్థితిని ఇంత దగ్గరగా ఎప్పుడూ చూడని సిద్ధార్థ మనసు అల్లకల్లోలమైంది. తన తండ్రి తన నిక్కడి కెందుకు తీసుకొచ్చాడోసిద్ధార్థ కిప్పుడర్థమైంది. తన తండ్రి అప్పుడుచదువుకోకపోయుంటే తాను కూడా తన రక్తసంబంధీకుల్లా...? దుర్భర దారిద్ర్యంలో... మురికి మురికిగా...!

సిద్ధార్థ మనసు బాధపడింది. అన్ని సౌకర్యాలనుభవిస్తూ కేవలం స్కూటర్ కొనివ్వనందుకు తాను తండ్రిని నిందించాడు. ఎందుకు కొనివ్వడంలేదో చెప్పినా తాను వినిపించుకోలేదు.

తండ్రి మనసుకు బాద కలిగించినందుకు తనను తానే నిందించుకున్నాడు.

తనరక్త సంబంధీకుల పరిస్థితులను కళ్ళారా చూసినసిద్ధార్థ కను కొలుకుల నుంచి రెండు కన్నిటీ బిందువులు రాలాయి. ఆ కన్నీటి బిందువులే అతని మనసును పునీతం చేశాయి. రెండు రోజులుగా చూసిన విషయాలను మననం చేసుకున్న సిద్ధార్థకు ఆ రాత్రి జ్ఞానోదయ మైంది. ఆ ఊరాతనికి బోధివృక్ష మైంది. వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న సిద్ధార్థ ఇప్పుడు బుద్ధుడయ్యాడు.

తెల్లవారి అందరికీ వీడ్కోలు చెప్పి కొడుకుతో సహా పట్నం వెళ్ళిపోయాడు తిరుపతయ్య రెండ్రోజుల తరువాత కొడుకును తన పక్కన కూర్చోబెట్టుకొని అనునయంగా అన్నాడు తిరుపతయ్య.

''బాబూ! నే ననుభవించిన దుర్భర పరిస్థితులు నా సంతానం అనుభవించ కూడదని కష్టపడ్డాను. ఆ ఛాయలు కూడా మీకు తెలియకుండా పెంచాను. నేను కష్టపడి సంపాదించిన డబ్బు మీ రనుభవించడానిక్కాకుంటే మ రెందుకు? కాని చదువుకునే రోజుల్లో చదువుపైన కంటే ఇతర విషయాల మీదికి మనసు పోతే చదువుకు భంగం కలుగుతుందన్న ఉద్దేశంతోనే నేను నీకు స్కూటర్ కొనివ్వలేదు. కాని నువ్వు నన్నపార్థం చేసుకొని నిన్ను కష్టపెడుతున్నానని కంట తడిపెట్టావు. సహజంగా ఇంటలిజెంట్‌పైన నిన్ను ఐ. ఎ.స్. ఆఫీసర్‌గా చూడాలని నా కోరిక. ఇది సాధ్యమైనా, కాకున్నా ప్రయత్నం చేయడంలో తప్పులేదు. పట్టుదలుంటే సాధ్యం కానిదీ లేదు.కాని, కొద్ది రోజులుగా నువ్వు చదువుపైన కంటే ఇతర విషయాలకే ప్రాధాన్యమివ్వడం గమనించాను. ఈ వయసు ప్రతి మనిషి జీవితానికి టర్నింగ్ పాయింటు లాంటిది. ఇప్పుడు మనిషి తప్పటడుగు వేస్తే అది భవిష్యత్తుపైన తప్పకుండా ప్రభావం చూపుతుంది. నువ్వు దేన్నీ లక్ష్యపెట్టకుండా, బాగా చదువుకోవడమనే నీ కర్తవ్యాన్ని విస్మరించి, బంగారు చెంచా నోట్లో పెట్టుకొని పుట్టినవాడిలా ప్రవర్తించడం గమనించాను. నీకు వాస్తవ పరిస్థితులను తెలియజేయడానికే మ నూరికి తీసుకెళ్ళాను'' అని ఆగాడు తిరుపతయ్య.

తండ్రిలో కర్తవ్యం విస్మరించిన పార్థునికి గీతోపదేశం చేసే శ్రీకృష్ణుణ్ణి చూస్తున్నాడు సిద్ధార్థ. అతనేం మాట్లాడలేదు. తిరుపతయ్య లేచి లోపలి కెళ్ళాడు. బ్లాంక్ చెక్‌పైన సంతకం చేసికొడుక్కిస్తూ ''నీకంట తడి పెట్టించడం నా ఉద్దేశం కాదు. ఈ చెక్ తీసుకొని స్కూటర్‌కెంతవుతుందో రాసుకొని డబ్బు తెచ్చుకో స్కూటర్‌కొనుక్కో'' అన్నాడు.

వారం రోజుల కింది సిద్ధార్థ అయితే, ఆ చెక్కును సంతోషంగా తీసుకునేవాడే. కాని అతనిప్పుడు పూర్వపు సిద్ధార్థకాదు.

''నాన్నా! నా కిప్పుడు స్కూటర్ వద్దు. అవసరమున్నప్పుడు మీమ్మ ల్నడిగి డబ్బు తీసుకుంటాను. న్ను ఐ. ఎ. ఎస్. ఆఫీసర్‌గా చూడాలన్న మీ కోర్కను సఫలం చేయడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తాను. మీతో పరుషంగా మాట్లాడి బాధ కలిగించినందుకు క్షమించండి'' అని తండ్రి కాళ్ళకు నమస్కరించాడు.''

కొడుకు భుజాలు పట్టిపైకి లేపి కౌగిట్లోకి చేర్చుకున్నాడు తిరుపతయ్య.

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 25-7-90*